క్లుప్తంగా

ఘనంగా బురదమాంబ పండగ



బురదమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

రాంబిల్లి : దిమిలి గ్రామంలో మంగళవారం బురదమాంబ అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించారు. భక్తులు పసుపు, కుంకుమలు సమర్పించుకొని మొక్కులు తీర్చుకొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆలయం సహా పరిసరాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

జోరుగా పారిశుధ్య పనులు

కోటవురట్ల: వర్షాలకు వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ కోరారు. కె.వెంకటాపురంలో మంగళవారం పారిశుధ్య పనులు నిర్వహించారు. గ్రీన్ అంబాసిడర్లు వీధుల్లోని చెత్తను తొలగించి ఇళ్లల్లోని చెత్తను సేకరించారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా వ్యాధులు చుట్టుముట్టే ప్రమాదం ఉందన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు కాచి వడకట్టిన నీటిని తాగాలని సూచించారు.

సీజన్‌లో ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి

మునగపాక : సీజన్‌లో ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారి విమలగిరి కోరారు. మునగపాక పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆమె వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో రోగాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. శిబిరాన్ని సర్పంచ్ దిమ్మల అప్పారావు సందర్శించి రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు.

రామన్నపాలెంలో బోరు పనులు ప్రారంభం



బోరు పనుల్ని ప్రారంభిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని రామన్నపాలెంలో మంగళవారం జల్‌జీవన్ పథకంలో బోరు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సర్పంచ్ డ్రీమ్స్ నాయుడు కొబ్బరి కాయ కొట్టి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లాలం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

అచ్యుతాపురం(అనకాపల్లి): విద్యార్థులు లక్ష్యాలను ఏర్పరచుకొని ఉన్నత శిఖరాలు సాధించే దిశగా శ్రమించాలని అచ్యుతాపురం సీఐ మురళీధర్‌రావు అన్నారు. అచ్యుతాపురం మండలంలోని అచ్యుతా జూనియర్ కళాశాల విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. క్రమశిక్షణ, మంచి నడవడికతో మెలగాలని సూచించారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని, గురువులను గౌరవించాలని అన్నారు. తనను తాను సంస్కరించుకోలేని వాడు, ఎవరినీ సంస్కరించలేడని తెలిపారు. చెడు అలవాట్లు, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని తెలిపారు. కరస్పాండెంట్ శేషగిరిరావు, కళాశాల ప్రిన్సిపాల్ రాజాన సత్యనారాయణ, కళాశాల ఇన్‌ఛార్జ్ పద్మావతి పాల్గొన్నారు.

జగనన్న సురక్ష నేడు

కోటవురట్ల: మండలంలోని పాములవాక, అన్నవరం గ్రామాలలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఏవో చంద్రశేఖర్ తెలిపారు. పాములవాకలో తహసీల్దారు జానకమ్మ, అన్నవరంలో ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు బృందాలు కార్యక్రమం నిర్వహించి లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తారని తెలిపారు.

ఎస్.రాయవరం: పి.ధర్మవరం, చినగుమ్ములూరు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో రామచంద్రమూర్తి తెలిపారు. పి.ధర్మవరం తహసీల్దార్ బృందం, చినగుమ్ములూరులో ఎంపీడీవో బృందం అందుబాటులో ఉంటారన్నారు.

వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం

- పవన్‌కల్యాణ్ వాళ్ల ఉద్యోగాలు ఊడగొడతాడట
- చంద్రబాబు డైరెక్షన్.. పవన్ యాక్షన్
- యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు ధ్వజం



నాగులాపల్లిలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు



లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు



అచ్యుతాపురం మండలంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

యలమంచిలి : వలంటీర్ వ్యవస్థ దేశంలోనే అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గాంధీనగరం సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు అర్రెపు గుప్తా, బెజవాడ నాగేశ్వరరావు, ఎంపీపీ గోవింద్‌తో కలసి ఆయన లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ సినీనటుడు పవన్ కల్యాణ్ చంద్రబాబు రాసిచ్చిన స్క్రిప్ట్ చదివి వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నాడని, ప్యాకేజీకి అమ్ముడుపోయిన వ్యక్తి వలంటీర్లపై అవసరమైతే కోర్టులకు కూడా వెళ్లి వారి ఉద్యోగాలు తొలగిస్తానంటున్నాడని, ఇటువంటి వ్యక్తులు ప్రజలకేం మేలు చేస్తారని అన్నారు. 14 సంవత్సరాలు ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పరిపాలన చేసిన చంద్రబాబును ప్రజలు తిట్టుకుంటున్నారని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రతిపేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు దక్కుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు డాక్టర్ త్రినాథ్, సత్తిబాబు, నరసింహమూర్తి, కొండబాబు, తహసీల్దార్ రాణీ అమ్మాజీ , మున్సిపల్ కమిషనర్ వీరయ్య, టీపీవో శ్రీలక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, కోఆప్షన్ సభ్యురాలు షేక్ సయ్యద్ బీబి పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమం

అచ్యుతాపురం(అనకాపల్లి): పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని యలమంచిలి ఎమ్మెల్యే ఉప్పలపాటి రమణమూర్తి రాజు అన్నారు.అచ్యుతాపురం మండలంలోని ఆవసోమవరం,మడుతూరు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు.ఆవ సోమవరం అభివృద్ధికి తన హయాంలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ఎమ్మెల్యే వస్తున్నారంటే సహజంగా ప్రజల్లో ఏదో ఒక ఆశ ఉంటుందని, గ్రామాల్లోని అన్ని సమస్యల్ని పరిష్కరించాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆదేశించారని తెలిపారు.డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు చెప్పిన వారికే ప్రభుత్వ పథకాలు అందేవని, వారి చుట్టూ తిరగాల్సి వచ్చేదని తెలిపారు.ఈ ప్రభుత్వంలో అందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. జెడ్పీటీసీ లాలం రాంబాబు,కో–ఆప్షన్ జడ్పీ సభ్యుడు నర్మాల కుమార్, ఎంపీటీసీ ఈత బాబూరావు,ఎంపీడీవో విజయలక్ష్మి,తహశీల్దార్ శ్రీనివాసరావు,దేశంశెట్టి శంకర్‌రావు,విమలనాయుడు,పిన్నంరాజు వాసు,మోటూరు సంజీవి,జువ్వాలనాయుడు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమం అందాలనే....

మునగపాక : వార్డు సభ్యునిగా గెలవలేని పవన్‌కల్యాణ్ నిరంతరం ప్రజా సేవ చేస్తున్న వలంటీర్లపై ఆరోపణలు చేయడం అవివేకమని ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు అన్నారు. మండలంలోని నాగులాపల్లి సచివాలయంలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఆయన అర్హులకు పలు రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు డైరెక్షన్‌లో పవన్‌కల్యాణ్ నటిస్తున్నారన్నారు. అర్హులై ఉండి ఇంతవరకు ప్రభుత్వ పథకాలకు నోచుకోలేని వారికి న్యాయం జరిగేలా జగనన్న సురక్ష కార్యక్రమం రూపుదిద్దారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకోవడం ద్వారా మరింత సంక్షేమం అందుతుందన్నారు. సర్పంచ్ జామి చినమ్మలు అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ,వైస్ ఎంపీపీ చిందాడ దేవి, పార్టీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, ఎంపీటీసీ మళ్ల కాశీ సురేష్, మాజీ వైస్ ఎంపీపీ దొడ్డి వరహా, పీఏసీఎస్ అధ్యక్షుడు మళ్ల ఉమామహేశ్వరరావు,పార్టీ నేతలు మళ్ల సూరప్పారావు, ముచ్చకర్ల సత్యనారాయణ, బొడ్డేడ బుజ్జి, పెంటకోట జ్యోతి, సచివాలయాల మండల కన్వీనర్ పొలిమేర గణేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి చూడండి...ఆశీర్వదించండి



గ్రామస్తులకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు



క్రైస్తవ శ్మశాన వాటికను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

పాయకరావుపేట : రాష్ట్రంలో ప్రతి గడపకు ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అందాలన్నదే ధ్యేయంగా ముఖ్యమంత్రి, పేదల పెన్నిధి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మంగవరం గ్రామంలో మంగళవారం ఆయన వర్షంలో తడుస్తూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల లబ్ధిపై గ్రామస్తులంతా సంతోషం వ్యక్తం చేశారు. గ్రామంలో రహదారులు, డ్రైనేజీల సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. ఇళ్ల స్థలాలు లేని వారికి గ్రామానికి వీలైనంత దగ్గరగా మంజూరు చేయాలని పలువురు కోరగా, ఆ మేరకు పరిశీలన చేయాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. గ్రామంలో వేర్వేరు సందర్భాల్లో ప్రమాదాల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు పరిహారం సొమ్ము అందలేదని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వెంటనే మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ జగనన్న ప్రభుత్వానికే పట్టం కట్టాలని గ్రామస్తులను ఎమ్మెల్యే కోరారు. సంక్షేమ పథకాలతో ముద్రించిన బ్రోచర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, జెడ్పీటీసీ లంక సూర్యనారాయణ, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, సర్పంచ్ వంగలపూడి సరస్వతీ రామారావు, పాయకరావుపేట పీఏసీఎస్ చైర్మన్ దేవవరపు రాజేష్ ఖన్నా, ఎంపీటీసీ గూటూరు విజయలక్ష్మి రామగోవిందు, పార్టీ నాయకులు దేవవరపు సూర్యం, సత్యనారాయణ, పుత్రరావు, పెనుమత్స నాగేశ్వరరావు, బొడ్డా శ్రీదేవి,నాగభూషణం, ఎంపీడీవో సాంబశివరావు, తహసీల్దార్ కె.జయప్రకాష్ పాల్గొన్నారు.

క్రైస్తవ శ్మశానవాటిక ప్రారంభం

పట్టణ పరిధిలో గల క్రైస్తవ శ్మశానవాటికను ఎమ్మెల్యే గొల్ల బాబూరావు మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. క్రైస్తవులకు గతంలో ప్రత్యేకంగా శ్మశానవాటిక స్థలాన్ని పంచాయితీ కేటాయించింది. ఈ స్థలం చుట్టూ డెక్కన్ ఫైన్ కెమికల్ ఫ్యాక్టరీ యాజమాన్యం చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టారు. దీనిని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ప్రారంభించి, స్థానిక క్రైస్తవ సంఘాల పెద్దలకు, పాస్టర్లకు అప్పగించారు. సర్పంచ్ గారా ఉష శ్రీ ప్రసాద్, ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీను, జెడ్పీటీసీ సూరిబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడుసాయిబాబా, ఆయా సంఘాల పాస్టర్లు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో మళ్లీ జగనన్నకే పట్టం

- అందుకు సమష్టిగా కృషి చేయాలి
- ఓటరు జాబితా సవరణలు పక్కాగా విశ్లేషణ చేయండి
- కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ చేపట్టండి
- కార్యకర్తలకు ఎమ్మెల్యే కన్నబాబు దిశానిర్దేశం



యలమంచిలిలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

యలమంచిలి : రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా కృషి చేయాలని యలమంచిలి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు (కన్నబాబు)అన్నారు. మంగళవారం యలమంచిలి పట్టణ కార్యాలయంలో పట్టణ, మండలంలో ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజాబలం పెంపొందించుకునేలా ప్రతి ఒక్క కార్యకర్త సైనికుడిగా పనిచేయాలన్నారు. నియోజకవర్గంలో అత్యధిక సంఖ్యలో ఓటర్లను చేర్పించాలని, కొత్త ఓటర్ల చేర్పులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని, జనన, మరణ ఓటర్ల తొలగింపు చేర్పులు నిశితంగా పరిశీలన చేయాలని అన్నారు. వైయస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో అందరికీ ఎటువంటి లబ్ధి చేకూరుతోందో ప్రజలకు వివరించాలని, వారి సమస్యలు నేరుగా విని పరిష్కారానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని అన్నారు.

క్రీడలకు చేయూత అభినందనీయం



పి.ధర్మవరం ఉన్నత పాఠశాలలో హాకీ శిక్షణ పొందుతున్న విద్యార్థులు

ఎస్.రాయవరం: పి.ధర్మవరం గ్రామంలో విద్యార్థులకు హాకీ కోచింగ్ ఇవ్వడం, ఈమేరకు పలువురు వారికి క్రీడా సామాగ్రి అందజేయడం అభినందనీయమని పూర్వ విద్యార్థులు అభినందించారు. గ్రామానికి చెందిన అచ్యుత్ హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ సమకూర్చిన ఆట వస్తువులతో విద్యార్థులకు క్రీడా ప్రతిభ పెరుగుతుందని, గ్రామీణ ప్రాంతాల్లో మరింత మంది క్రీడల్లో రాణిస్తారని అభిప్రాయ పడ్డారు.

పచ్చదనం పెంపొందిస్తేనే మనుగడ



మొక్కలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు



ఐకేపీ కార్యాలయం వద్ద మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం : ప్రాణవాయువునిచ్చే మొక్కలు ప్రతి ఒక్కరూ పెంచాలని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. గ్రీన్ మిలీనియం కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సభ్యులకు ఎమ్మెల్యే మొక్కలు పంపిణీ చేశారు. అంతకు ముందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పచ్చని వాతావరణం ఉన్నప్పుడే వాతావరణ సమతుల్యత దెబ్బతినకుండా ఉంటుందన్నారు. చల్లని నీడనిచ్చే మొక్కలతో పాటు కుటుంబానికి ఆదాయం సమకూర్చే కొబ్బరి వంటి మొక్కలు పెంచుకోవడం ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. అనంతరం వెలుగు కార్యాలయం ప్రాంగణంలో ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామచంద్రమూర్తి, ఏపీఎం శివప్రసాద్, ఎంపీపీ లోవలక్ష్మి , మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు, సర్పంచ్‌లు భూపతి అప్పారావు, శానాపతి శ్రీరాములు, పాపారావు, లోవరాజు, ఎంపీటీసీలు సూరిబాబు, బైపా శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ నాగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, గొంతిన సత్యనారాయణ, వరహాలరావు, ఆదిమూర్తి పాల్గొన్నారు.

నాగులాపల్లిలో మొక్కల పంపిణీ

మునగపాక : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు (కన్నబాబు) పిలుపునిచ్చారు. నాగులాపల్లిలో వెలుగు అధికారులు ఏర్పాటు చేసిన మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలన్నారు. వెలుగు ఏపీఎం కొండమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పాటుపడాలి



ఊరేగింపుగా వస్తున్న సర్పంచ్ నూకరాజు, ఉపాధి కూలీలు

మునగపాక : మహిళా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతుందని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు అన్నారు. వాడ్రాపల్లిలో మంగళవారం ఉపాధిహామీ పథకం కూలీలతో అమ్మవారి పండగ నిర్వహించారు. ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం కూలీలను ఉద్దేశించి మాట్లాడారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ అందుబాటులోకి రావడం ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. సచివాలయ కన్వీనర్ పెతకంశెట్టి రామజోగినాయుడు,వైఎస్సార్‌సీపీ మండల మహిళా అధ్యక్షురాలు శీరా రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శంగా మూలపేట



మూలపేటలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ గంగప్పలనాయుడు

మునగపాక: మూలపేట గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని సర్పంచ్ బీశెట్టి గంగప్పలనాయుడు పేర్కొన్నారు. గ్రామంలోని దివంగత నేత రాజన్న విగ్రహం నుంచి ఏటి కాలువలోకి వెళ్లేందుకు వీలుగా గతంలో కాలువ ఉండేది. పదేళ్ల క్రితం కాలువ పూడికపోవడంతో గ్రామంలోని మురుగునీరు ప్రవహించడం లేదు. దీంతో సర్పంచ్ గంగప్పలనాయుడు ప్రత్యేక చొరవ తీసుకొని అండర్ గ్రౌండ్ డ్రైనేజీలో భాగంగా పైపుల ఏర్పాటు పనులు మంగళవారం చేపట్టారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు సత్యనారాయణ,గోవిందరావు, వరలక్ష్మి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలు సత్వరం పూర్తి చేయాలి



జేవీపాలెంలో నిర్మాణ దశలో ఉన్న వెల్‌నెస్ సెంటర్ భవనాన్ని పరిశీలిస్తున్న ఈఈ

ఎస్.రాయవరం : గ్రామాల్లో నిర్మాణ దశలో ఉన్న సచివాలయ, రైతు భరోసా, వెల్‌నెస్ కేంద్రాలు సెప్టెంబర్ 15 నాటికి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని నర్సీపట్నం డివిజన్ ఈఈ వి.ఎస్.నాగేష్‌బాబు అన్నారు. తిమ్మాపురం, గుడివాడ, గెడ్డపాలెం, జేవీపాలెం తదితర గ్రామాల్లో మంగళవారం ఈఈ పర్యటించారు. నిర్మాణ దశలో ఉన్న భవనాలు పరిశీలించి, నిర్మాణ వేగం పెంచాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. నిర్మాణం పూర్తయిన భవనాలకు ప్రభుత్వం బిల్లులు కూడా సకాలంలో చెల్లిస్తోందని చెప్పారు. డివిజన్ పరిధిలో 420 భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయని ఇప్పటికే 153 భవనాలు ప్రారంభించామన్నారు. ఈ పరిశీలనలో ఈఈ వెంట మండల ఏఈ దుర్గా శంకర్ పాల్గొన్నారు.

బదిలీ అయిన సీఐకి సన్మానం



సీఐని సత్కరిస్తున్న వేంపాడు టోల్‌ప్లాజా ఏజీఎం తదితరులు

నక్కపల్లి : స్థానిక సర్కిల్ సీఐగా పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న వి. నారాయణరావును వేంపాడు టోల్‌ప్లాజా సిబ్బంది మంగళవారం వీడ్కోలు పలికి సత్కరించారు. సీఐ నారాయణరావుకు అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీ అయింది. ఆయన స్థానంలో అప్పన్నబాబు నియమితులయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం వేంపాడు టోల్‌ప్లాజాకు సంబంధించి టీబీఆర్ ఏజీఎం రాజేష్, టోల్‌ప్లాజా మేనేజర్ కృష్ణ, ఐఎంటీ మేనేజర్ సత్యనారాయణ తదితరులు సీఐని ఆయన కార్యాలయంలో కలిసి దుశ్శాలువతో సత్కరించారు. సీఐగా నారాయణరావు తన బాధ్యతలను ఎంతో సమయస్ఫూర్తితో నిర్వర్తిస్తూ శాంతి భద్రతలను కాపాడడం, రోడ్డు ప్రమాదాల నివారణంలో విశేష సేవలందించారన్నారు.

రోడ్డు ప్రమాదాలు నివారించాలి



నాగులాపల్లిలో రహదారి భద్రతా ర్యాలీ ప్రారంభిస్తున్న ఎస్‌ఐ అలీ

మునగపాక : ప్రతి వాహనదారుడు ప్రమాదాలకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్‌ఐ మహమ్మద్ అలీ షరీఫ్ కోరారు. రహదారి భద్రత కార్యక్రమంలో భాగంగా వెలుగు ఆధ్వర్యంలో నాగులాపల్లిలో మంగళవారం ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా అలీ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ తగదన్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం సరికాదన్నారు. వెలుగు ఏపీఎం కొండమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డీఎల్‌డీవో మంజులావాణి, తహసీల్దార్ ప్రకాశరావు, ఎంపీడీవో మన్మథరావు, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ చిందాడ దేవి, సచివాలయాల మండల కన్వీనర్ పొలిమేర గణేష్, ఎంపీటీసీ మళ్ల కాశీసురేష్,పార్టీ నేతలు బొడ్డేడ బుజ్జి, పెంటకోట జ్యోతి పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో ఆరోగ్య సేవలు మెరుగుపరచాలి



రేగుపాలెం పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గోవింద్

యలమంచిలి : పీహెచ్‌సీల్లో ఆరోగ్య సేవలు మెరుగు పరచాలని ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. మంగళవారం ఆయన రేగుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను ఎంపీడీవో అప్పలనాయుడుతో కలసి సందర్శించారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు ప్రజలుకు మరింత చేరువ చేయాలన్నారు. ఫీవర్ సర్వే విధిగా నిర్వహించాలని సూచించారు. జగనన్న ప్రభుత్వం విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో వైద్యసేవలు అందేలా చూస్తోందని, మందులు సరఫరా అందిస్తోందని తెలిపారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో నూతనంగా అదనపు గదుల నిర్మాణంపై వైద్య సిబ్బందితో చర్చించారు. కార్యక్రమంలో రేగుపాలెం సర్పంచ్ రాజాన మహాలక్ష్మి, మండల పరిపాలన అధికారి ప్రసాదరావు మండల వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు త్రినాథ్, అస్పత్రి వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.


అడపా దడపా చిరుజల్లులు

రాంబిల్లి: మండలంలో మంగళవారం ముసురు వాతావరణం అలుముకుంది. ఆకాశం మేఘావృతమై తేలికపాటి చినుకులు అడపాదడపా పడ్డాయి. చల్లని గాలులు వీశాయి. మరో పక్క రైతులు వరి విత్తనాలు పోత పనుల్లో నిమగ్నమయ్యారు. ముసురుతో పడుతున్న తేలికపాటి చినుకులతో విత్తనాలు బాగా మొలకెత్తుతాయని రైతులు తెలిపారు.

అధికారులు స్పందించాలి

కోటవురట్ల: గిరిజనుల సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు ఉద్యమం ఆగదని, వారికి సీపీఎం అండగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం తెలిపారు. అణుకు గిరిజనుల రిలే నిరాహార దీక్ష 12వ రోజు మంగళవారం కొనసాగింది. దీక్షా శిబిరాన్ని సందర్శించిన సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం వారికి సంఘీభావం తెలిపారు. మండల కేంద్రానికి అతి దగ్గరలో ఉన్నప్పటికీ అణుకు గిరిజన గ్రామంలో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. గ్రామంలో రక్షిత మంచినీటి పథకం ఏర్పాటు చేయాలని, ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు నిర్మించి, 5 ఎకరాల పోడు భూమి పట్టా ఇవ్వాలని, పాఠశాల ఏర్పాటు చేయాలని, రహదారి నిర్మించాలని, విద్యుత్ సౌకర్యం మెరుగుపరచాలని, ప్రతి కుటుంబానికి అంత్యోదయ కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రికార్డులు పక్కాగా ఉండాలి



సమావేశంలో వర్తకులతో మాట్లాడుతున్న డీఎస్పీ సత్యనారాయణ

పరవాడ: యాసిడ్ వ్యాపారులు రికార్డులు పక్కాగా నిర్వహించాలని పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ సూచించారు. యాసిడ్ దాడుల నివారణ అన్న అంశంపై యాసిడ్, కెమికల్, బంగారం, మెడికల్ దుకాణాల వ్యాపారులతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో డీఎస్పీ మాట్లాడారు. నేరస్తులకు యాసిడ్ దొరికే పరిస్థితులను కఠినతరం చేయడం ద్వారా యాసిడ్ దాడులను అరికట్టవచ్చునని ఆయన అభిప్రాయపడ్డారు. యాసిడ్ వినియోగం, వ్యాపారంలో కచ్చితమైన రికార్డులు పాటించాలని సత్యనారాయణ సూచించారు. కార్యక్రమంలో సీఐ పి.ఈశ్వరరావు, ఎస్‌ఐ సిరపరపు సురేష్, వ్యాపారులు, ల్యాబ్ సిబ్బంది పాల్గొన్నారు.